క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి, తాడూర్, మండెపల్లి గ్రామాల పరిధిలో గురువారం 11కేవీ విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలు కొట్టే పనుల కారణంగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని సెస్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన దేవయ్య, శంకర్

వేములవాడ: మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా పోంచెట్టి శంకర్‌ను సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మున్నూరు కాపు సంఘ సత్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శి స్థానాలకు ఒక్కొక్కటే నామినేషన్లు దాఖలు కావడంతో.. ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేశ్ ప్రకటించారు. వారిని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

భక్తులకు బగారా అన్నం



అన్నం వడ్డిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన 150 మంది భక్తులకు బుధవారం మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో బగారా అన్నాన్ని ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, పాలాస రాజేందర్, ప్రతాప నటరాజు, పసుల శ్రీనివాస్, గుమ్మడి కుమార్, గొండ ప్రసాద్, పిట్టల రాజ్‌కుమార్, సగ్గు రాహుల్, ఏలేశ్వరం సాయినాథ్ వడ్డించారు. ఎండలోనూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారంటూ భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం నుంచి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ప్రతి గ్రామం నుంచి కబడ్డీ, వాలీబాల్ జట్లు పాల్గొనాలని కోరారు. పోలీస్ స్టేషన్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి కబడ్డీ, వాలీబాల్ జట్లు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ పిల్లలను చేర్పిస్తే నాణ్యమైన విద్యాబోధన చేసి వారిని నిష్ణాతులుగా తయారు చేస్తామని కళాశాల అధ్యాపకులు ఇంటింటా తిరుగుతూ తల్లిదండ్రులను కోరుతున్నారు. రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, దుమాల గ్రామాల్లో బుధవారం అధ్యాపకులు ఇంటింటికి వెళ్లి వసతులపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, నీరటి విష్ణుప్రసాద్, కొడిముంజ సాగర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ప్రచారంలో తంగళ్లపల్లి నాయకులు



జనగామలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నిక సందర్భంగా బుధవారం తంగళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జనగామ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. జనగామ 20వ వార్డు కౌన్సిలర్ జూకంటి లక్ష్మి శ్రీశైలం, వార్డు అధ్యక్షుడు దామెర రాజుతో కలిసి ప్రచారం చేశారు. సిరిసిల్ల సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, జాగృతి మండల అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణం..

- ఉపాధి పనుల వద్ద కానరాని వసతులు
- వెంకట్రావుపేట ఘటనలో అందరూ భాగస్వాములే..



వెంకట్రావుపేటలో ప్రమాదం జరిగిన స్థలం

కోనరావుపేట: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఉపాధి పనుల్లో జరిగిన సంఘటనపై తలాపిడికెడు పాపం మూటగట్టుకున్నారు. దీని మూలంగా ఒక నిండు ప్రాణం బలి కాగా.. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై అధికారులు తలాతోక లేని సమాధానాలిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు. ఉపాధి కూలీలకు వసతులను కల్పించాల్సిన పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో.. ప్రత్యేకాధికారులు కూలీలకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. ప్రత్యేకాధికారులను పర్యవేక్షించాల్సిన మండలాధికారులే ఏమీ పట్టనట్టు వ్యవహరించడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయి. కాగా గ్రామాల్లో ఉండాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శి, ఏపీవోలను మండల పరిషత్ అధికారి పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఇందులో ఎవరికి వారే యమునా తీరే అన్న విధంగా వ్యవహరిస్తూ తూతూ మంత్రంగా రికార్డుల్లో మాత్రమే తనిఖీలు చేస్తున్నట్లు చూపిస్తున్నారు.

నిర్లక్ష్యం..

ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు కనీస వసతులు కల్పించడంలో అటు అధికారులు, ఇటు పంచాయతీలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూలీలు పని చేసి సేదతీరడానికి నీడ వసతిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఎక్కడా కానరావడం లేదు. నీటి వసతి కూడా ఏర్పాటు చేయకపోవడంతో కూలీలే ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో లేకపోగా.. ఆశ కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.

అందని వేసవి భత్యం

మండలంలో 28 గ్రామాలున్నాయి. అన్ని గ్రామాల్లో కలిపి 11,095 జాబ్‌కార్డులున్నాయి. ప్రతీ సంవత్సరం వేసవి కాలంలో కూలీలకు అదనపు భత్యాన్ని అందించేవారు. ఎండాకాలం కాబట్టి భూమి గట్టిగా ఉండడంతో చేసిన పని కంటే 20 శాతం అదనంగా వారి వేతనాల్లో కలిపేవారు. ఈ అదనపు భత్యాన్ని కూడా తొలగించారు.

అందరూ భాగస్వాములే..

వెంకట్రావుపేటలో మంగళవారం జరిగిన సంఘటనలో మహిళా కూలీ మారుపాక రాజవ్వ మృతిచెందగా.. ఆరుగురు కూలీలు గాయాలపాలయ్యారు. పని ప్రదేశంలో నీడ వసతి ఏర్పాటు చేయకపోవడంతోనే కూలీలు నీడ కోసం చిన్నపాటి బొరియలో కూర్చుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు అందరూ భాగస్వాములయ్యారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

పిచ్చుకను కాపాడిన బుడతలు



చిన్నారుల చేతిలో ఒదిగిన పిచ్చుక

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన ముగ్గురు చిన్నారులు బుధవారం ఓ పిచ్చుకను కాపాడి శభాష్ అనిపించుకున్నారు. వేసవి సెలవులు కావడంతో ఆడుకునేందుకు మండెపల్లికి చెందిన గడగోని నిహంత్, హర్షిత్, త్రినయ్ సిరిసిల్లలోని బతుకమ్మ ఘాట్ వద్దకు బుధవారం వెళ్లారు. ఆ సమయంలో నీరు దొరక్క ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పిచ్చుకను గమనించి.. వెంటనే దాన్ని తమ చేతుల్లోకి తీసుకొని వెంట తెచ్చుకున్న వాటర్‌బాటిల్ మూతలో నీరు పోసి తాగించారు. కొద్దిసేపు సపర్యాలు చేయడంతో తేరుకుంది. వెంటనే తుర్రన ఎగిరిపోయింది. పిచ్చుక ప్రాణాన్ని కాపాడిన చిన్నారుల సంతోషానికి అవధులు లేవు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిరిసిల్లకల్చరల్: పాలీసెట్‌లో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. పద్మశాలీ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(పోపా) ఆధ్వర్యంలో 45 రోజులుగా నిర్వహించిన ఉచిత పాలీసెట్ శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి పోపా ప్రతినిధులు మండల విద్యాధికారి దూస రఘుపతి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్, కోర్సు డైరెక్టర్ మచ్చ ఆనందం, పోపా కార్యదర్శి కనుకుంట్ల పున్నం చందర్ తదితరులు మాట్లాడారు. ఉచిత శిక్షణలో నేర్చుకున్న మెళకువలను పాటించి పాలీసెట్‌లో మంచి ర్యాంకులు సాధించాలని పిలుపునిచ్చారు. పరీక్ష రాసే సమయంలో మానసికంగా దృఢంగా ఉండి ఎలాంటి అయోమయానికి తావు లేకుండా ఉండాలని సూచించారు. పోపా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు అండగా ఉంటున్న పోపా ప్రతినిధులు, శిక్షణ కార్యక్రమంలో ప్రత్యక్ష భాగస్వాములైన 25మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. పోపా ప్రతినిధులు ఆడెపు వేణు, మామిడాల భూపతి, సామల తిరుపతి, కొంపెల్లి కృష్ణ, బైరి రవీందర్, కోడం పూర్ణిమ, బైరి రమాదేవి, తిరుమల, జక్కని నవీన్, శ్రీపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- వెంబడిస్తూ.. గాయపరుస్తూ..
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బాలుడి తొడపై కుక్క కాట్లు

ఏడాదిగా కుక్క కాటుతో చికిత్స పొందినవారు

మే	90
జూన్	110
జూలై	100
ఆగస్టు	75
సెప్టెంబర్	90
అక్టోబర్	54
నవంబర్	87
డిసెంబర్	105
జనవరి	92
ఫిబ్రవరి	58
మార్చి	96
ఏప్రిల్	105
మే	75

వేములవాడఅర్బన్: పట్టణంలోని వార్డుల్లో వీధి కుక్కలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. వీటిని నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల్లో గుంపులుగుంపులుగా తిరుగుతూ చిన్నారులను గాయపరుస్తున్నాయి. దీంతో ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో అడవులకు..

పట్టణంతోపాటు వేములవాడ మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కల బెడదతో ఇబ్బందిగా మారింది. రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోజూ ఏదో ఒక వార్డులోని చిన్నారులు, పెద్దలు, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయి. గతంలోనూ ఇలాగే జరిగితే మున్సిపల్ అధికారులు శునకాలను పట్టుకొని అడవుల్లో వదిలివేసినట్లు తెలిపారు. ఇటీవల ఎక్కువగా చిన్నారులను సైతం గాయపరుస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పట్టించుకొని కుక్కలను పట్టణాలు, గ్రామాల్లో లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

20 మందిని..

ఇటీవల వేములవాడ పట్టణంలోని నాంపల్లి, భగవంతారావునగర్, సాయినగర్‌లో చిన్నారులను కుక్కలు ఎక్కువగా గాయపర్చాయి. రెండు, మూడు రోజుల్లోనే సుమరు 20 మంది చిన్నారులను గాయపర్చడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అన్ని మందులు అందుబాటులో..



కుక్క కాటుకు సంబంధించి అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కుక్క కాటుతో ఆస్పత్రికి చాలామంది వస్తున్నారు. అందరికీ చికిత్స అందిస్తున్నాం. శునకాలు గాయపరిస్తే ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలి.

– మహేశ్‌రావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

భయంగా ఉంది



మా ఇంటి ముందు గేటు వద్ద నిల్చొని ఉన్నా. ఒక్కసారిగా కుక్క వచ్చి గాయపర్చింది. మా అన్నయ్య వచ్చి వెళ్లగొట్టడంతో వెళ్లిపోయాయి. ఇంటి ముందుకు రావాలంటే భయంగా ఉంది.

– జశ్వంత్, నాంపల్లి

త్వరలోనే పట్టుకుంటాం



వేములవాడ మున్సిపల్ పరిధిలో కుక్కలు చిన్న పిల్లలను గాయపరుస్తున్నట్లు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో కుక్కలను పట్టి అడవుల్లో వదిలేసేలా చూస్తాం. గతంలోనూ ఇలాగే చేశాం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



మల్యాలలో కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

చందుర్తి(వేములవాడ): మల్యాల గ్రామానికి చెందిన బిటుకు లచ్చయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి పెద్దఎత్తున పొగలు బయటకు రావడంతో చుట్టుపక్కల ఇళ్ల వారు అప్రమత్తమై ఇంట్లోకి ప్రవేశించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వాషింగ్ మిషన్, ఫ్రిజ్, బియ్యం, వడ్లు, దుస్తులకు మంటలు అంటుకోవడంతో పొగ బయటకొచ్చింది. వెంటనే గ్రామస్తులందరూ ఏకమై మంటలను అదుపులోకి తెచ్చారు. లచ్చయ్యకు సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

సిరిసిల్లక్రైం: కొమురవెల్లి ఎస్‌ఐ భార్య ఇచ్చిన ఫిర్యాదు చిలికిచిలికి గాలివానగా మారి సిద్దిపేట కమిషనరేట్ నుంచి సిరిసిల్ల పోలీస్ శాఖకు అంటుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని కొమురవెల్లి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు రెండో పెళ్లి చేసుకొని తనకు, తన పిల్లలకు అన్యాయం చేస్తున్నాడంటూ అతడి భార్య మానస ఈనెల 21న స్టేషన్ ఎదుట బైఠాయించి తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు నాగరాజుపై వేటు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే వివాదంలో సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ప్రమేయం ఉందని బాధితురాలితోపాటు ఎస్‌ఐ పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలిసింది. దీంతో ప్రాథమిక విచారణలో భాగంగానే ముస్తాబాద్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై పోలీస్ అధికారులను వివరణ కోరగా.. అధికారిక లిఖితపూర్వక ఉత్తర్వులు వెలువడేవరకు వివరాలను వెల్లడించలేమని దాటవేశారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోనరావుపేట: పల్లిమక్త గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ఆంజనేయులు తన సిబ్బందితో దాడి నిర్వహించారు. గ్రామానికి చెందిన జిన్న బాబు, మోకెనపల్లి రాంబాబు, ఎనగంటి రమేశ్, మోకెనపల్లి దేవరాజ్, జాగిరి కిరణ్, అలిపిరి ఆనందం వద్ద 6 సెల్‌ఫోన్లు, రూ.2,970 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పిన్నింటి హన్మండ్లు బుధవారం డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రకటనలో తెలిపారు. వేములవాడ బస్టాండ్‌లో బస్సును పాయింట్‌పై నిలిపి నిండిన తర్వాత వచ్చి డ్రైవర్ తన సీట్లోనే కూర్చొని టికెట్లు తీసుకోవాలని తెలపడంతో.. వెనక సీట్లలో కూర్చున్న వారు టికెట్ తీసుకునేందుకు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రయాణికులతో డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడంపై డీఎంకు ఫిర్యాదు చేసినట్లు హన్మాండ్లు తెలిపారు. ఈ విషయంపై వేములవాడ డిపో మేనేజర్ మురళీకృష్ణను వివరణ కోరగా.. కండక్టర్, డ్రైవర్ అతనే కావడంతో టికెట్లు తీసుకోవాలని సూచించారని, ఎవరిపై దురుసుగా మాట్లాడలేదని తెలిపారు.

ఇల్లంతకుంట ఇన్‌చార్జి ఎంఈవోగా రఘుపతి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల ఇన్‌చార్జి ఎంఈవోగా తంగళ్లపల్లి ఎంఈవో దూస రఘుపతిని నియమించగా.. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా ఇల్లంతకుంటలో ఇన్‌చార్జి ఎంఈవోగా చేసిన వేములవాడ ఎంఈవో ఇటీవల ఎన్నికల నిబంధనలు మీరినందుకు సస్పెండయిన విషయం తెలిసిందే. కొత్త ఎంఈవో దూస రఘుపతి ఇప్పటికే ఐదు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

నరసింహస్వామి జయంతి



ఆధ్యాత్మికం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజలు, అభిషేకం, అలంకరణ, సుదర్శన హోమం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు.



సిరిసిల్లటౌన్: విద్యానగర్ అభయాంజనేయస్వామి ఆలయంలోని నృసింహస్వామి జయంతి బుధవారం నేత్రపర్వంగా సాగింది. ప్రత్యేక పూజలు, వేద పారాయణం నిర్వహించారు.



ముస్తాబాద్: చీకోడులో శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు నరసింహాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. గణపతి హోమం, పూర్ణాహుతి చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిపేట: రాచర్లగుండారంలోని శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, గుండాడి రాంరెడ్డి, బండారి బాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు శ్రీనివాస్‌రావు, లక్ష్మీనర్సు, వెంకట్రావ్, బాల్‌నర్సు, సూడిది రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం



కోనరావుపేట(వేములవాడ): నిజామాబాద్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి అధ్యయనోత్సవ, వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారి ఎదుర్కోళ్లు నిర్వహించి కన్నుల పండువగా కల్యాణోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, సెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, ఆలయ కమిటీ సభ్యులు నోముల బాపురెడ్డి, ముష్కం అంజయ్య, తాళ్లపల్లి రాములు, మంద సరోజన, విజయలక్ష్మి, ఇందిర, అర్చకుడు కొండమాచారి పాల్గొన్నారు.

తడగొండ వెంకన్న శోభాయాత్ర



బోయినపల్లి(చొప్పదండి): తడగొండ గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి పంచాహ్నిక కల్యాణంలో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి పారివేట శోభాయాత్ర ఉత్సాహంగా నిర్వహించారు. పూజారులు చక్రపాణి ఆచార్య, అనిల్ ఆచార్య, హరికృష్ణ ఆచార్య పాల్గొన్నారు.

శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగం



వేములవాడఅర్బన్: రుద్రవరం గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగం బుధవారం ఘనంగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు పర్వతీ వేణు, నాయకులు ఆర్సీరావు, తాడెం శ్రీనివాస్, మెడికల్ రాజిరెడ్డి, హరికృష్ణ, శ్రీనివాస్, పర్శరాములు, కట్ట తిరుపతి, మహేశ్, శ్రీకాంత్, కాసర్ల అరుణ్, జింక శ్రీధర్, బాలయ్య తదితరులున్నారు.

పోచమ్మ బోనాలు



ముస్తాబాద్: పోతుగల్‌లో గంగపుత్రులు బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. గంగాభవానీ ఉత్సవాల్లో భాగంగా పోచమ్మ బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. గంగపుత్రులు వలను అందంగా అలంకరించి బోనాలతో ఆలయానికి వెళ్లి పూజలు చేశారు.

దుబాయ్‌లో మొబైల్ అప్లికేషన్ ప్రారంభించిన విప్



ఆది శ్రీనివాస్‌తో సయాఖీ కంపెనీ ప్రతినిధులు

వేములవాడ: దుబాయ్ పర్యటనలో ఉన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం ఆ ప్రాంతంలోని ఆదాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీకి చెందిన సయాఖీ కార్, డాక్టర్ మొబైల్ యాప్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. తెలంగాణకు చెందిన యువతరానికి ఉపాధి నిస్తున్న సంస్థకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆది శ్రీనివాస్‌ను తెలుగువాళ్లందరూ ఘనంగా సన్మానించారు.

గల్ఫ్ కష్టాలు తెలుసుకునేందుకే దుబాయ్ పర్యటన



మాట్లాడుతున్న సంగ స్వామి

వేములవాడ: ఎడారి దేశం గల్ఫ్‌లో తమ ప్రాంత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు.. వారి స్థితిగతులను తెలుసుకునేందుకు, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపులో భాగస్వాములైన గల్ఫ్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపేందుకే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దుబాయ్ వెళ్లారని డీసీసీ ఉపాధ్యక్షుడు సంగ స్వామియాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలపై విలేకరులతో మాట్లాడారు. బీసీ బిడ్డలైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విదేశాలకు వెళ్తే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. పిడుగుపాటుకు గురై మృతిచెందిన శాత్రాజ్‌పల్లికి చెందిన శ్రీనివాస్ కుటుంబంతోపాటు కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్యమందించాలని అధికారులు, పార్టీ శ్రేణులను ఆదేశించిన గొప్ప నాయకుడు ఆది శ్రీనివాస్ అని అన్నారు. బండ శ్రీనివాస్, నాగుల నర్సయ్య, కనికరపు రాకేశ్, అంబాటి చందు పాల్గొన్నారు.